క్లుప్తంగా

మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా హంజా హుస్సేని


హంజా హుస్సేని

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన హంజా హుస్సేని నియమించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ మైనార్టీ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు(అర్బన్) : నగరంలోని పడారుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గండికోట సురేంద్రబాబు మృతి చెందగా అతని కుటుంబానికి డాక్టర్లు, వైద్యసిబ్బంది దాతల సహకారంతో శనివారం రూ.1.30 లక్షల చెక్కును అందించారు. దీనిని సురేంద్రబాబు కుటుంబ సభ్యులకు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, గౌరవ సలహాదారు అరవ పరిమళ అందించారు. ఆర్థిక సహకారం అందించిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, అసోసియేషన్ నాయకులు సాయికార్తీక్, తిరుపతయ్య, వేణు, ఆల్ఫ్రెడ్, వెంకటయ్య, శ్రీనివాసులుకు హంస నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

నేత్రదానం


సుజన్‌కృష్ణ(ఫైల్)

నెల్లూరు(అర్బన్) : వేదాయపాళెనికి చెందిన అరవ భూమి సుజన్‌కృష్ణ(25) పాతకక్షల నేపథ్యంలో శుక్రవారం రాత్రి హతమయ్యారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు హేమలత, వంశీ జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. నేత్రాలను ఎల్వీప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయం

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


వ్యాసరచన పోటీల విజేత రావుతేజశ్రీకి జ్ఞాపిక అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్

నెల్లూరు(బారకాసు) : ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. కస్తూర్బా కళాక్షేత్రంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధానికి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మేయర్ స్రవంతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులను వాడాలన్నారు. చివరగా వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. మున్సిపల్ సిబ్బందికి, విద్యార్థులకు జ్యూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, అడిషనల్ కమిషనర్ నందన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పాల్గొన్నారు.

• నగరంలోని తడికల బజారు సెంటర్‌లో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ పాల్గొని, పలు సూచనలు చేశారు. అదేవిధంగా బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణం, మైపాడు గేట్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

• నగరంలోని వీఆర్సీ వద్ద వీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్, వీసీ అల్లం శ్రీనివాసరావు, కమిషనర్ సూర్యతేజ పాల్గొన్నారు.

• స్థానిక గాంధీ బొమ్మసెంటర్‌లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్లాత్ బ్యాగ్స్‌ను పంపిణీ చేశారు. అర్బన్ ఎంహెచ్ఓ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సెక్రటరీలు పాల్గొన్నారు.

• నగరంలోని నుడా కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పలు సూచనలు చేశారు. సిటీ ప్లానర్ హిమబిందు, నుడా సెక్రటరీ పెంచలరెడ్డి పాల్గొన్నారు.

• నెల్లూరు (పొగతోట) : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలో అధికారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పలు సూచనలు చేశారు. అనంతరం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని, జూట్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్‌ను వినియోగించాలన్నారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

• నెల్లూరు సిటీ : రూరల్‌లోని దేవరపాళెం గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పలు సూచనలు చేశారు. ఉప సర్పంచ్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

• రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

• నెల్లూరురూరల్ : స్థానిక కలెక్టరేట్ పరిసరాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో ఉదయ భాస్కర్, ఏఓ విజయకుమార్ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

• నెల్లూరు(అర్బన్) : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత అన్నారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల్లోని చెత్తను డాక్టర్లతో కలిసి ఆమె తొలగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డాక్టర్ దయాకర్, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు

• నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో, సర్వజన ఆస్పత్రి ఎంసీహెచ్ విభాగం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ గురించి వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి అన్నారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, డాక్టర్లు కృష్ణమూర్తి, హెచ్‌డీఎస్ కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, కమిటీ సభ్యుడు మల్లికార్జున పాల్గొన్నారు.

• నగరంలోని ట్రంకురోడ్డులో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత మెడికల్ షాపుల యాజమాన్యాలు పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ వీరకుమార్‌రెడ్డి పలు సూచనలు చేశారు. ఔషధ నియంత్రణ శాఖ ఇన్‌స్పెక్టర్ కీర్తిపవిత్ర, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, సీనియర్ నాయకులు అశోక్, వెంకటేశ్వర్లు, నరేంద్ర, కేపీ ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.


ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో..


గాంధీ బొమ్మ సెంటర్‌లో..


జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో..


జెడ్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న అరుణమ్మ


ట్రంకురోడ్డులో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రంగనాథుని రథోత్సవం సందర్భంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ తెలిపారు. రంగనాయకులపేట నుంచి ములుమూడి బస్టాండ్ వరకు, పినాకిని పార్క్, ఉప్పరపాళెం, కామాక్షినగర్, మాగుంట నగర్, బొగ్గలవీధి ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, రవీంద్ర నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అంతరాయాలు ఉంటాయన్నారు.

ఆదాలకు సత్కారం



నెల్లూరు(బారకాసు) : పవిత్ర రంజాన్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు శనివారం సత్కరించారు. ఈ మేరకు ఆదాల క్యాంప్ కార్యాలయంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఏసు నాయుడు, 12వ డివిజన్‌కు చెందిన షేక్ కరిముల్లా తదితరుల ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు ఆదాలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కొండ్రెడ్డి రంగారెడ్డి, సమ్మద్, అఫ్జల్, బషీరా, అహ్మద్ బాషా, సుభాని, జిలాన్, మున్నా, రెహమాన్, హఫీజ్, అల్లాభక్షు, ఖలీల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి అవార్డులు



నెల్లూరు (టౌన్): నగరంలోని నేతాజీ నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని కామంచి శారద పలు అవార్డులు అందుకున్నారు. విద్య, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన సందర్భంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈమెకు ఈనెల 12న హైదరాబాద్‌లో మహిళా శిరోమణి-2025 అవార్డు, 14న ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ వారు సోషల్ ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు. ఈ మేరకు ఆమెకు నగరంలోని పలువురు శనివారం అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

• ఘనంగా వైఎస్సార్‌టీఏ వార్షికోత్సవం


అసోసియేషన్ నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(బారకాసు) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా ఏపీ వైఎస్సార్‌టీఏ ఉద్యమించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న పార్టీ సిటీ కార్యాలయంలో ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొని, కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌టీఏ ఉత్తమ అసోసియేషన్‌గా కీర్తి గడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునీర్‌జాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, వాసు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలత, జిల్లా కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు పండ్లూరు విద్యార్థులు



నెల్లూరు (టౌన్) : విజయవాడలో రాష్ట్రస్థాయి మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు జరిగిన విభా ఎల్ఎఫ్‌డబ్ల్యూ పరీక్షల్లో రూరల్ మండలం పండ్లూరు మండల ప్రజా పరిషత్తు స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఇక్కడ ఐదో తరగతి చదువుతున్న చరణ్ శ్రీనివాస్ ప్రథమ స్థానం, నాలుగో తరగతి చదువుతున్న బేబీ పుష్పలత ఆరో స్థానం సాధించి జాతీయ పోటీ పరీక్షలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్‌లో డీఈఓ బాలాజీరావు ఏఎంఓ సుధీర్‌బాబులు చిన్నారులకు శనివారం సన్మానం చేశారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

మర్యాదపూర్వకంగా..


విజయకుమార్‌రెడ్డిని సత్కరించిన అబ్దుల్ సలీం

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులైన సయ్యద్ అబ్దుల్ సలీం శనివారం ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, అలీమ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ధర్నా



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని శెట్టిగుంట రోడ్డు, సర్వేపల్లి కాలువ కట్ట, మౌలాసాహెబ్ వీధి ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ప్రమాదభరితంగా ఉన్నాయని, వెంటనే తమ సమస్యను పరిష్కరించాలంటూ స్థానికులతో కలిసి సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు నవాబుపేట రైతుబజార్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర నాయకులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ మాట్లాడుతూ శెట్టిగుంటరోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు తక్కువ ఎత్తులో ఉన్నాయని, చిన్నపాటి గాలికే తెగిపోయే విధంగా ప్రమాదకర స్థితిలో ఉన్నాయన్నారు. దీనిపై విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెంగయ్య, మూలం ప్రసాద్, నాగరాజు, ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పార్టీల వల్లే పిఠాపురంలో విజయం

నెల్లూరు సిటీ : బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల సమష్టి కృషి వల్లే పిఠాపురంలో పవన్‌కల్యాణ్ గెలుపు సాధ్యమైందని టీడీపీ నాయకుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా నాగబాబు వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపు డిసైడ్ అయిందని, అయితే మూడు పార్టీల సమష్టి కృషితో భారీ గెలుపు సాధ్యమైందని తెలిపారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రంగడి కల్యాణం


కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

• పులకించిన తల్పగిరి క్షేత్రం


తరలివచ్చిన భక్తులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న రంగడి క్షేత్రం కల్యాణోత్సవంతో పులకించింది. రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయదేవేరులతో ప్రత్యేకంగా అలంకరించారు. సర్వాలంకార శోభితంగా కొలువైన తల్పగిరీశుడి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనంతో స్వామివారి ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ప్రథమంగా శనివారం సాయంత్రం పూలంగిసేవ నిర్వహించారు. తర్వాత స్వామివారి కల్యాణ ఘట్టంలో భాగమైన శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవాన్ని జరిపించారు. కల్యాణ మహోత్సవం అనంతరం రాత్రి ఒంటి గంటకు స్వామివారు విశేషాలంకారంలో గజ వాహనంలో భక్తులకు దర్శనమిస్తూ అనుగ్రహించారు. కాగా పూలంగిసేవ ఉభయకర్తగా బొద్దుకూరు సుధాకర్ నాయుడు, కల్యాణ మహోత్సవం, గజ వాహన సేవల ఉభయకర్తలుగా కంటే విద్యాసాగర్, గోపాలకృష్ణయ్య, బాల సుబ్రహ్మణ్యం, నాగరాజారావు వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8.30 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు పొన్నవాహన అలంకారోత్సవం జరుగనున్నాయని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు.

టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

నెల్లూరు(బృందావనం) : రంగనాథస్వామి దేవస్థానంలో జరిగిన స్వామివారి కల్యాణోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, బ్రహ్మోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు నేడు

నెల్లూరు(క్రైమ్) : నగరంలో ఆదివారం జరుగనున్న రంగనాథస్వామి రథోత్సవం సందర్భంగా పలు ట్రాఫిక్ ఆంక్షలను విధించినట్లు నగర డీఎస్పీ పి.సింధుప్రియ శనివారం తెలిపారు. స్థానిక రంగనాథస్వామి గుడి, పెన్నా బ్యారేజీ వైపు వాహన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే నాలుగు కాళ్ల మండపం నుంచి రంగనాథస్వామి గుడి మీదుగా రంగనాయకులపేట రైల్వేగేటు వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణదారులు, గృహస్తులు వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయరాదని సూచించారు. రథోత్సవం పూర్తయ్యేంత వరకు ప్రజలు సహకరించాలని కోరారు.

రథోత్సవానికి పటిష్ట భద్రత

నేటి రంగనాథుని రథోత్సవానికి జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో నగర డీఎస్పీ పి.సింధుప్రియ సుమారు 350 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. శనివారం రాత్రి బందోబస్తు విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి పోలీసు ఉన్నతాధికారులు పలు సూచనలు, సలహాలిచ్చారు.